క్లుప్తంగా

పేదల సంజీవని సీఎం రిలీఫ్ ఫండ్



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ముఖ్యమంత్రి సహాయనిధి ఆపద కాలంలో పేదలకు సంజీవనిలా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 4వ వార్డుకు చెందిన నక్కా శ్రీనివాసుకు రూ.2 లక్షలు, ఇటీవల మృతి చెందిన గచ్చపు వీధికి చెందిన రుత్తల భాస్కరరావుకు రూ.3 లక్షల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో ఎమ్మెల్యే ఆయా కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ నాయకులు చిటికెల కన్నబాబు, దాడి బుజ్జి, రుత్తల శ్రీనువాసరావు, ఆరుగుల్ల రాజుబాబు, దేవత అరుణ పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆర్డీవో హెచ్.వి.జయరాం ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు డివిజన్ వ్యాప్తంగా 12 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి ఆర్డీవో ఫిర్యాదులు స్వీకరించారు. 11 ఫిర్యాదులు భూసమస్యలకు సంబంధించినవి ఉన్నాయన్నారు. గత స్పందనలోని 13 అర్జీల్లో 9 పరిష్కరించామన్నారు. స్పందన ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచబోమని తెలిపారు. తహసీల్దార్ అన్నాజీ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విప్ ధర్మశ్రీ పరామర్శ



ఆస్పత్రిలో నాగేశ్వరరావును పరామర్శిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి భర్త నాగేశ్వరరావు గుండెపోటుకు గురయ్యారు. ఆదివారం ఆయన్ను విశాఖ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. కోమాలోకి చేరుకున్న అతన్ని పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మండల ఇన్‌చార్జి గేదెల శేషు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి కే అచ్చింనాయుడు సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. త్వరగా కోలుకుని ఇంటికి వస్తారని ఎంపీపీకి ధైర్యం చెప్పారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న సర్పంచ్ తదితరులు

చీడికాడ: సాంకేతిక విద్యా విప్లవం దిశగా జగనన్న అడుగులు సాగుతున్నాయని సర్పంచ్ మట్టా అప్పారావు అన్నారు. సోమవారం తురువోలు ఉన్నత పాఠశాలలో 8వ తరగతికి చెందిన 12 మంది విద్యార్థులకు బైజ్యూస్ కంటెంట్‌తో కూడిన నూతన ట్యాబ్‌లను ఎంఈవో రమణతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగితే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పీటీ బాబు, హెచ్ఎం రామకృష్ణ, ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు జీపీఏ నాయుడు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట: వడ్డాది మెయిన్ స్కూల్‌లో భోగి మంటలు కాగుతున్న విద్యార్థులు



నర్సీపట్నం: యకరన్నపాలెం స్కూల్‌లో భోగి మంట చుట్టూ తోటి మహిళలతో చిడతలు వేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి



దేవరాపల్లి: కాశీపురం హైస్కూల్‌లో భోగి మంటతో సందడి చేస్తున్న విద్యార్థులు



చోడవరం రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

సందడిగా సంక్రాంతి సంబరాలు

మన సంస్కృతిని ప్రతిబింబించే పండగ సంక్రాంతి.. మకర సంక్రమణ ధాన్యరాశులతో తులతూగే పల్లెల్లో వారం రోజుల ముందుగానే సంబరాలు వచ్చేశాయి. చూడముచ్చటైన రంగవల్లికలు, గొబ్బెమ్మలు, భోగి మంటలు.. గాలిపటాలు, బొమ్మలకొలువులు, హరిదాసు, గంగిరెద్దులు, ఘుమఘుమలాడే పిండి వంటలు.. విద్యార్థుల వేషధారణలు.. వెరసి తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి ఉత్సవాలను సోమవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు.



నాతవరం: ఎం.బి.పట్నం హైస్కూల్‌లో సంప్రదాయ దుస్తులతో ఉపాధ్యాయులు

- పాఠశాలల్లో ముందస్తుగా వేడుకలు
- వివిధ వేషధారణలో విద్యార్థుల అలరింపు

నర్సీపట్నం/మాకవరపాలెం/బుచ్చెయ్యపేట/దేవరాపల్లి/రోలుగుంట/నాతవరం/రావికమతం/చీడికాడ: నర్సీపట్నం మండలం యకరన్నపాలెం ఎంపీపీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, సర్పంచ్ పాల్గొన్నారు. పాఠశాలలో వేడుకలు నిర్వహించటం ద్వారా విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టత తెలుస్తుందని ఎంపీపీ పేర్కొన్నారు. స్కూల్ చైర్‌పర్సన్ దాలితల్లి, హెచ్ఎం ఆళ్ల వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్‌లో హరిదాసు వేషధారణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులతో కనువిందు చేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంక్రాంతి విశిష్టత గురించి వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాకవరపాలెం మండలం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల, బుచ్చెయ్యపేట మండలం వడ్డాది మెయిన్ పాఠశాల, దేవరాపల్లి మండలం కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, రోలుగుంట మండలం వెలంకాయలపాలెం ఎంపీపీ పాఠశాల, నాతవరం మండలం ఎం.బి.పట్నం హైస్కూల్, రావికమతం మండలం కొత్తకోట హైస్కూల్, మరుపాక మోడల్ స్కూల్, కవగుంట స్కూల్, చీడికాడ మండలం కోనాం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సంబరాలు ఘనంగా నిర్వహించారు.

చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందుగానే సంక్రాంతి శోభను సంతరించుకుంది. నూతన విద్యార్థుల స్వాగత వేడుక(ఫ్రెషర్స్ డే) సంక్రాంతి పండుగ సంబరాలతో కళకళలాడింది. విద్యార్థినులకు రంగవల్లులు, సంప్రదాయ వస్త్రధారణ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులు తమ సీనియర్ల సలహా, సంప్రదింపులతో ధైర్యంగా ముందడుగు వేస్తూ చక్కని భవిష్యత్తును సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, సీనియర్ ఉపన్యాసకులు ఎస్.ఎం. రఫీయుద్దీన్, జి.సత్యనారాయణ, జ్యోతి, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, రత్న భారతి పాల్గొన్నారు.



మాకవరపాలెం: తూటిపాల పాఠశాలలో హరిదాసు, సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



రోలుగుంట: హరిదాసు ప్రదర్శనతో పలువురిని ఆకట్టుకుంటున్న వెలంకాయలపాలెం విద్యార్థి



రావికమతం:కొత్తకోటలో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు, నాయకులు,ఉపాధ్యాయులు



చీడికాడ: భోగిమంట ముందు వివిధ వేషధారణలో విద్యార్థినులు

సమ్మచింత వద్ద చెక్ డ్యామ్ ఏర్పాటుకు కృషి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: రైతుల భూములకు సాగునీరు అందించేందుకుగాను ఎం.కె.పట్నం పంచాయతీ సమ్మచింత వద్ద రిజర్వాయర్ కాకుండా ఎవరికీ ఇబ్బంది లేకుండా చెక్ డ్యామ్ ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హామీ ఇచ్చారు. రాజన్నపేట పొలం పాకలను సోమవారం మధ్యాహ్నం సందర్శించిన ఆయన్ను ఈ ప్రాంత రైతులు సమ్మచింత వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే తమ భూములకు సాగునీరు అందుతుందని, గత ప్రభుత్వాల హయాంలో ఈ సమస్య తీరలేదని విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన ఈ సమస్యపై తాను ఇరిగేషన్ అధికారులతో కలసి అధ్యయనం చేశానన్నారు. ఇక్కడ రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే మేలు కన్నా వ్యయం అధికమవుతుందన్నారు. దీనిని ఏర్పాటు చేయడం వల్ల అధికారుల ఎస్టిమేషన్ ప్రకారం ఎకరాకు రూ.లక్ష నిర్దేశించిన వ్యయం కన్నా రూ.10 లక్షల ఖర్చవుతుందని తేల్చి చెప్పారన్నారు. ఇక్కడ రిజర్వాయర్ ఏర్పాటుకు నర్సీపట్నం మండలం రావణాపల్లి, నాతవరం మండలం తాండవ రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చాయన్నారు. వారి అభ్యంతరాలు సంబంధం లేకుండా, ఖర్చు ఎక్కువ కాకుండా ఈ ప్రాంత రైతులు అవసరం తీరే మాదిరిగా చెక్ డ్యామ్ ఏర్పాటు చేస్తానన్నారు. దీని వల్ల ఏ ఒక్కరీ అభ్యంతరం, నష్టం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి కంకణం కట్టుకొని పని చేస్తోందన్నారు. ఈయనతో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు దోసపత్తి రాజు, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ప్రపంచం గర్వించదగ్గ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. నియోజకవర్గ ముఖ్య నాయకులతో సోమవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా తాడేపల్లిలో రూ.443 కోట్లతో అంబేడ్కర్ స్మృతివనాన్ని ఏర్పాటు చేసి, 185 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారన్నారు. ఈ నెల 19న ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. నియోజకవర్గంలోని 78 సచివాలయాల్లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు స్మృతివన ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, ఎంపీపీలు రుత్తల సత్యనారాయణ, సాగిన లక్ష్మణ్‌మూర్తి, గజ్జలపు మణికుమారి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, సచివాలయాల కన్వీనర్లు తమరాన శ్రీను, చిన బాబు, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనువాసరావు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, లగుడు శ్రీనువాసరావు, రుత్తల శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై మరింత ప్రచారం చేయాలి

అధికారులు, వలంటీర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



అధికారులు, వలంటీర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని అధికారులను, వలంటీర్లను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశించారు. చోడవరం మేజర్ పంచాయతీ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు, వలంటీర్ల, గృహసారథులతో సోమవారం ఆయన సమీక్షించారు. చోడవరం పట్టణంలో నాలుగున్నరేళ్లలో మంచినీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరించామన్నారు. 2,300 మందికి పింఛన్లు ఇస్తున్నామని, చేయూత, ఆసరా పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఎటువంటి సిఫారసులు లేకుండా ఇస్తున్నామన్నారు. వార్డుల్లో రోజువారీ కార్యక్రమంగా పెట్టుకుని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. అర్హత ఉండి ఏ కారణంతోనైనా పథకాలు అందకపోతే అటువంటి వారిని గుర్తించి ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రధానంగా వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం తరపున ఏయే పథకాలు వచ్చాయో లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శివ కృష్ణ, ఏఈ కనకమ్మ, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, కార్యదర్శి నారాయణరావు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి రాజేష్

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో గిరిజన గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని ఎం. కోడూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం శంకరంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ శోలం రమేష్ అధ్యక్షతన పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఎంపీపీ కార్యాలయం పర్యవేక్షకుడు జి.వి.వి. గోపాలరాజు, ఎంపీటీసీ తుర్రె సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో 'గడపగడపకు' నేడు

దేవరాపల్లి: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం దేవరాపల్లిలో నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు. సచివాలయం-1 పరిధిలోని ఉదయం 9 గంటలకు రెల్లిపేట నుంచి ప్రారంభమై చిన్నంనాయుడు నగర్ కాలనీ, కొరుపోలు వారి కల్లాలు, ఎరుకుల కాలనీ, మెయిన్‌రోడ్డు, కొల్లూరి వారి వీధి, హుకుంపేట, కుమ్మరి వీధుల్లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

5 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

రావికమతం: ఐదు లీటర్ల సారాతో గొంప గ్రామానికి చెందిన పల్లా నూకరాజును అరెస్ట్ చేశామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. గ్రామంలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేయగా నూకరాజు సారాతో పట్టుబడ్డాడన్నారు.

న్యాయవాదుల నిరసన

నర్సీపట్నం: న్యాయవాదులు విధులు బహిష్కరించి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల భూములు, స్థిరాస్తి హక్కులను న్యాయవ్యవస్థ పరిధి నుంచి తొలగించటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

నర్సీపట్నం: పిల్లల నడవడిక, చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ ఎన్. వెంకటరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి సెలవులకు విద్యార్థులకు ఇళ్లకు వెళ్తున్న సందర్భంగా ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుతోపాటు విద్యార్థుల్లో వ్యాపార దృక్పథాన్ని పెంపొందించేందుకు చిరుధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేయించి స్టాల్‌లో ప్రదర్శించారు. వీటిని వారి తల్లిదండ్రులు పరిశీలించి కొనుగోలు చేశారు. ఉపాధ్యాయులు సత్తిబాబు, శ్రీదేవి, రజనీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తకోట హైస్కూల్‌కు టేబుళ్లు వితరణ



టేబుళ్లను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రావికమతం: కొత్తకోట పీఎస్ఆర్ఎం హైస్కూల్‌లో 1968-73 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు నాలుగు టేబుళ్లను సోమవారం వితరణగా అందించారు. 50 ఏళ్ల తర్వాత వీరంతా ఇటీవల ఇక్కడ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్‌కు టేబుల్స్ ఇవ్వాలని నిర్ణయించుకున్న మేరకు రూ.20 వేలతో కొనుగోలు చేసి హెచ్ఎం నాగేశ్వరరావుకు అందించారు. పూర్వ విద్యార్థులు వీఎస్ ప్రకాశరావు, ప్రసాద్, ఎంవీ రమణ, వీ చినబాబు, నవర ముని, జీ త్రినాథరావు, శెలా దేముళ్లు, గారపాటి జోగారావు, పీ రమణాజి తెలిపారు.

స్కై మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారిణికి అభినందన



వాసవిని అభినందించిన ఉపాధ్యాయులు

రోలుగుంట: జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని గోడె వాసవిని హెచ్ఎం ఎస్.అప్పారావు, సర్పంచ్ గరగా విశ్వేశ్వరరావు సోమవారం అభినందించారు. బీబీపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువున్న విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైన విషయం విదితమే. ఈ నెల 2న జైపూర్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తన స్వగ్రామం బీబీపట్నం చేరుకుంది.

మండల స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలి

మాకవరపాలెం: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల్లోనూ సత్తా చాటాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ ఆకాంక్షించారు. మండల స్థాయికి ఎంపికైన విజేతలకు సోమవారం ఆయన మూరుగుపాలెంలో క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. తామరంలో తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, రాచపల్లిలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం క్రీడా సామగ్రితోపాటు టీ షర్టులను పంపిణీ చేశారు.

ఎ.కొత్తపల్లి మీదుగా సింధియాకు బస్సు సర్వీస్



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న కిలపర్తి భాస్కరరావు

దేవరాపల్లి: దేవరాపల్లి నుంచి వయా కాశీపురం, చిననందిపల్లి, పెదనందిపల్లి, ఎ. కొత్తపల్లి, కె.ఎం. పాలెం, యండపల్లి పాలెం, వారాడ మీదుగా సింధియాకు బస్సు సౌకర్యం సమకూరింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాలతో స్థానిక ప్రయాణికుల సౌకర్యార్థం గాజువాక డిపో నుంచి ఆర్టీసీ అధికారులు నూతన బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్సును దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సర్వీస్‌తో పది గ్రామాలకు బస్సు సౌకర్యం సమకూరిందని డిప్యూటీ సీఎంకు ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, ఏ కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పందూరు సరువునాయుడు, వాలేటి నాగరాజు, దీవి శంకర్, సబ్బవరపు మాలి బాబు, మిడతాడ శ్రీను పాల్గొన్నారు.